క్లుప్తంగా

తాళ్ల రవీంద్రబాబుకు నంది అవార్డు



నంది అవార్డు అందుకుంటున్న తాళ్ల రవీంద్రబాబు

పాకాల : కళా రంగంలో విశేష సేవలు అందించిన తాళ్ల రవీంద్రబాబుకు నంది అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాదులోని త్యాగయ్య గాన సభలో ఆదివారం తెలుగు రత్నాలు కళా సంస్థ ఆధ్వర్యంలో అవార్డు అందజేశారు. తాళ్ల రవీంద్రబాబు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పాటలు రాసి పాడుతూ ఉంటారు. అలాగే నృత్యం చేస్తారు. అన్నమయ్య కీర్తనలు, జానపదాలు పాడడం, రచనలు చేయడం, కోలాటం, చెక్కభజన, పండరి భజన, కులుకు భజన, తప్పెటగుళ్లు, చలంబ్రాలు, కీలుగుర్రాలు, కర్రసాము, జానపద నృత్యాలు, గుస్సాడీ, వీధి భాగవతం, ఇలా 30 రకాల కళలు ప్రదర్శించడంలో ప్రావీణ్యుడు. తాళ్ల రవీంద్రబాబుకు అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ముస్సోరి శిక్షణకు కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య ఈనెల 10వ తేదీ నుంచి 14 తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో జరగనున్న మునిసిపల్ గవర్నెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ సర్వీస్ శిక్షణకు వెళ్లనున్నారు. దీంతో ఇంచార్జి కమిషనర్‌గా అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డికి బాధ్యతలను అప్పగించారు.

పీఆర్సీ కోసం కమిటీని నియమించాలి



మాట్లాడుతున్న బీటీపీ నాయులు

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కోసం వెంటనే కమిటీని నియమించి ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామమూర్తి, జాతీయ ఉపాధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల ఆవరణలో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కె.రామచంద్రయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2023 జూలైతో 11వ పీఆర్సీ గడువు ముగిసినా ఇప్పటికీ ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చి 9 నెలలు గడుస్తున్నా 12వ పీఆర్సీ కమిటీని నియమించకపోవడం సరి కాదన్నారు. ప్రభుత్వం స్పందించి పీఆర్సీని నియమించి ఐఆర్‌ను 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు ఆదికేశవులు, జ్యోతిప్రసాద్, కృష్ణమూర్తి, జయబాల, రాజేంద్రుడు, గోపాలయ్య, గణేష్, వెంకటయ్య, శివప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజలు ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య 0877–2227208 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు. అలాగే 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తామని, ప్రజలు నేరుగా అర్జీలు అందజేయవచ్చని వెల్లడించారు. అర్జీదారులు వినతి పత్రంతో పాటు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌ను అర్జీలో నమోదు చేయాల్సి ఉంది.

13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 13న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలకు ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా 13వ తేదీ ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతి ఇస్తారు.

అలరించిన భరత నాట్యం



శిల్పారామంలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి రూరల్ : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం రాత్రి వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నైకి చెందిన బాబాంజలి నృత్యాలయ కళాకారులు ప్రదర్శించిన భరత నాట్యం అందరినీ అలరించింది. నృత్యాలయం ప్రతినిధులు, నృత్యకారులు, కళాకారులను శిల్పారామం పరిపాలన అధికారి ఖాదర్‌వలి సత్కరించారు.

ఆనందం.. ఆపాదపుస్తకం!

పుస్తక పఠనంతో అనంత విజ్ఞానం సొంతమవుతుంది. మనోవికాసానికి పునాది పడుతుంది. మానవీయ విలువల విశిష్టత అవగతమవుతుంది. సంస్కారవంతంగా జీవనం సాగించడంపై అవగాహన ఏర్పడుతుంది. ఈ క్రమంలోనే తిరునగరి వాసుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో 17 ఏళ్లుగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇస్కాన్ రోడ్డులోని మైదానంలో బుక్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఆదివారంతో ముగిసిన ప్రదర్శనలో వందలాది పుస్తకాలను పాఠకులు కొనుగోలు చేశారు. జ్ఞాన సముపార్జనకు బాటలు వేసుకున్నారు.



- ఘనంగా ముగిసిన పుస్తక ప్రదర్శన
- 70 స్టాల్స్‌లో విశిష్ట గ్రంథాలను కొనుగోలు చేసిన పాఠకులు
- పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యమన్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: పుస్తక పఠనమే మానవ వికాసానికి పునాది అనే నినాదంతో భారతీయ విద్యాభవన్ వారు తిరుపతిలోని ఇస్కాన్ రోడ్డులోని మైదానంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన జనంలో పఠనాశక్తిని రేకెత్తించింది. ప్రజల్లో సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించే దిశ గా 17 ఏళ్లుగా క్రమం తప్పకుండా భారతీయ విద్యాభవన్ పుస్తక ప్రదర్శన చేపడుతోంది. ఈ క్రమంలోనే ఈనెల 1 నుంచి సాగుతున్న పుస్తక ప్రదర్శన మహోత్సవంలో రాష్ట్రంలోని ప్రముఖ పబ్లికేషన్స్ ప్రచురించిన అత్యంత విలువైన, విభిన్న పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వైద్య, విజ్ఞాన, సాహిత్యాలకు సంబంధించిన వేలాది పుస్తకాలు, బాల సాహిత్యం, కథలు, సైన్స్ టెక్నాలజీ, సంస్కృతిని ఆవిష్కరించే కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, టీటీడీ ప్రచురణలు, వివేకానందుడు వంటి మహనీయుల జీవిత చరిత్రలు, బాలగేయాలు, ఆధ్యాత్మిక, సైన్స్ విజ్ఞానం, ఇతిహాసాలు, సాంఘిక, బడుగుల జీవితం, నవలలు, వివిధ చారిత్ర విజ్ఞానానికి సంబంధించిన లక్షల పుస్తకాలు లభించడంతో పాఠకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రదర్శనలోని 70 స్టాల్స్‌లో పుస్తకాలను పరిశీలించి తమకు అవసరమైనవి కొనుగోలు చేసుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు

పుస్తక ప్రదర్శన ఆవరణలో ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేదిక ద్వారా ప్రముఖ రచయితల పుస్తకాల ఆవిష్కరణ, సమీక్షలు చేపట్టడంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

చరిత్ర తెలుసుకోవాలనే..



చరిత్ర తెలుసుకోవాలన్న తాపత్రయమే పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచింది. పోలీసు వృత్తిలో కొనసాగుతున్నా పురాతన నాణేలను సేకరించడం అలవాటు. అలాగే చారిత్రక నేపథ్యం గల పుస్తకాల అన్వేషణలో ఉన్నా. గండికోట రహస్యాలు పుస్తకం కొన్నా. ఈ పుస్తక ప్రదర్శనతో విజ్ఞానం, వినోదం లభించింది. ఏటా ఈ ప్రదర్శనకు వచ్చి అవసరమైన పుస్తకాలు కొంటున్నా.

– సురేష్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్

చక్కటి నేస్తం



మస్తిష్కాన్ని పాడుచేసే మొబైల్‌ను వదిలి, మంచి పుస్తకాన్ని చదవడం ఆరంభిస్తే అది మనకు చక్కటి నేస్తంగా నిలుస్తుంది. కాలం చాలా విలువైంది. సమయం దొరికినప్పుడు పుస్తకాలు చదివితే జ్ఞానం కలుగుతుంది. ఈ ప్రదర్శనలో అనేక రకాల కొత్త పుస్తకాలు లభించాయి. సామాజిక శాస్త్రాలు, జీవిత చరిత్రలు, అనువాద రచనలు చదవడం గొప్ప అనుభూతిని కలిగించింది.

– ఎస్.సుజాత, పాఠకురాలు

విలువలు పెంచేందుకే..

జనాల్లో పఠనాసక్తి పెంచి విలువలు, సంస్కృతి, సంప్రదాయాలతో ప్రతిభావంతుల ను చేయాలనే లక్ష్యంతో భారతీ య విద్యాభవన్ ఏటా పుస్తక ప్రదర్శన మహోత్స వం చేపడుతోంది. బుక్ యూనివర్సిటీ పేరుతో 1951లో పుస్తక ప్రచురణలకు శ్రీకారం చుట్టింది. 1957లో లక్ష పుస్తకాలు విక్రయించి పఠనంపై జనంలో ఆసక్తిని పెంచింది. పుస్తక ప్రదర్శనతో ఆదరణ పెరుగుతోంది.

– ఎస్.సత్యనారాయణరాజు, భారతీయ విద్యాభవన్ సంచాలకుడు

నడిపించే సాధనం



పుస్తక పఠనంతో మంచి ప్రయోజనాలు ఉన్నాయి. సంస్కరణ దిశగా జీవితాన్ని నడిపిస్తుంది. పఠనంతో జ్ఞానం లభిస్తుంది. ప్రతి సారి నిర్వహిస్తున్న ఈ పుస్తక ప్రదర్శన నా లాంటి పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటోంది. ప్రదర్శనలో కేశవరెడ్డి, చలం సాహిత్యం, విజయ విలాసం, అమృతం కురిసిన రాత్రి, చివరి గుడిసె వంటి పుస్తకాలు కొన్నా. ఇలాంటి పుస్తక ప్రదర్శనలు మరిన్ని నిర్వహిస్తే బాగుంటుంది.

– శ్రీనివాసులు, తెలుగు పరిశోధక విద్యార్థి

కొత్త విషయాలకు దిక్సూచి



పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంచుకోవడమే కాకుండా కొత్త విషయాలు తెలుస్తాయి. పుస్తక ప్రదర్శనకు పాఠకులు పెద్దసంఖ్యలో రావడం ఆనందం కలిగించింది. జిల్లా రచయితల సంఘం ఏర్పాటు చేసిన స్టాల్‌లో జన జీవన, వృత్తులు, సంస్కృతులను తెలిపే ఆసక్తికర పుస్తకాలు ఉన్నాయి. ఇక్కడ కొన్న శరత్ సాహిత్యం, విరాట్, కన్యాశుల్కం, మేధావుల పరామర్శ వంటి పుస్తకాలు చదివాను. విలువైన సమాచారం తెలుసుకోలిగా.

– హరీష్, పాఠకుడు.

విజ్ఞానం తీసుకెళ్లా



కుప్పం మెడికల్ కళాశాలలో వైద్య విద్య చదువుతున్నా. పుస్తక పఠనం అంటే ఎంతో ఇష్టం. కమ్యూనిజం సాహిత్యంపై మక్కువ ఎక్కువ. ప్రతి సారీ పుస్తక ప్రదర్శకు వస్తా. ఇప్పుడు స్టాల్స్ బాగా పెరిగాయి. కొత్త పుస్తకాలు చాలా ఉన్నాయి. నాకు నచ్చిన పుస్తకం బండి నారాయణస్వామి. రెండు కళల దేశం. ప్రస్తుత కలంలో పుస్తకాలు చదవేవారు తగ్గారు. తెలుగు పుస్తకాలు విరివిగా చదవాలి. ప్రదర్శనలో రూ.2వేలకు పుస్తకాలు కొన్నా. ఇంటికి విజ్ఞానం తీసుకెళ్లా.

– సంతోష్, వైద్య విద్యార్థి, కుప్పం.

తెప్పపై శ్రీకృష్ణస్వామి విహారం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం సాయంత్రం శ్రీఆండాళ్ సమేత శ్రీకృష్ణస్వామి తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆండాళ్ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్కరిణిలో తెప్పపై కొలువైన స్వామి, అమ్మవారు ఐదు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. సోమవారం నుంచి బుధవారం వరకు శ్రీగోవిందరాజస్వామి వారు శ్రీదేవి, భూదేవితో కలిసి తెప్పపై విహరించనున్నారు. కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయంగార్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా తిరుపతి

తిరుపతి తుడా : ప్లాస్టిక్ ఫ్రీ అవేర్నెస్ క్యాంపెయిన్ కోసం ఏర్పాటు చేసిన స్టూడెంట్స్ నేషన్ టీమ్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని వెంకటరమణ లేఅవుట్‌లో శని, ఆదివారాలు స్థానికులకు అవగాహన కల్పించారు. స్టూడెంట్స్ నేషన్ టీమ్ అధ్యక్షురాలు మల్లెల హర్షిణి మాట్లాడుతూ తిరుపతి మోడల్ కాలనీ కోసం టీమ్ సభ్యులతో కలిసి తొలి అడుగు వేశామన్నారు. ఈ ప్రేరణతో ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా తిరుపతి రూపొందాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి విక్రమ్, ప్రణవ్, సాగర్, హర్షిత, హారిక, పావని, సుదర్శన్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సోము వరి, గీతా, శివాజీ పాల్గొన్నారు.

ఘనంగా అమిగోస్ అధినేత జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అమిగోస్ అధినేత అనిత్‌రెడ్డి

తిరుపతి సిటీ: అమిగోస్ బిల్డర్స్ అధినేత అనిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన సంస్థ సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆయనకు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

అబాకస్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత



అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

తిరుపతి కల్చరల్: అబాకస్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని, తద్వారా సబ్జెక్టుల్లో మంచిగా రాణిస్తారని సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ క్రిష్ణమూర్తి, చిత్తూరు ఆర్‌డీవో ఎం.శ్రీనివాసులు, మెప్మా పీడీ, వైఎస్ఆర్ జిల్లా డెప్యూటీ కలెక్టర్ ఎం.కిరణ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర నేత రామానాయుడు తెలిపారు. గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం ధరణి అబాకస్ ఆధ్వర్యంలో నేషనల్ లెవల్ రాపిడ్ కాంపిటీషన్స్ అవార్డ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 1,540 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 430 మంది ఉత్తమ ప్రతిభ చాటారు. వారికి అతిథులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ధరణి అబాకస్ డైరెక్టర్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ అబాకస్ ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. అబాకస్ శిక్షణతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎడిఫై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్, నాగార్జున పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, శ్రీవిజ్ఞాన సుధ స్కూల్ డైరెక్టర్ ఎం.ప్రభాకర్, లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ డైరెక్టర్ శేషాద్రి, కుమార్ ఇంగ్లీషు మీడియం స్కూల్ చైర్మన్ వెంకటేష్‌బాబు, కౌటిల్య ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి ప్రతిభా పురస్కారం



గుండ్లూరు సుబ్రమణ్యంను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : తిరుపతికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి గుండ్లూరు సుబ్రమణ్యం ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కడపలో ఆదివారం వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం–రాయలసీమ భాగస్వామ్యం అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సుబ్రమణ్యం పాల్గొని రాయలసీమ పూర్వ వైభవం, ప్రస్తుత వైభవంపై రచించిన కవితను గానం చేశారు. ఈ క్రమంలో రచయితల సంఘం ప్రతినిధులు లయన్ ఖాసీం ఖాన్, ప్రసిద్ధ రంగస్థల నటుడు బాబుల్‌రెడ్డి ఆయనకు సత్కారం అందజేసి అభినందించారు.

20 నుంచి ముక్కోటిలో మహాశివరాత్రి ఉత్సవాలు



శ్రీఅగస్త్యేశ్వరస్వామివారి ఆలయం

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 20న ఉదయం 6 గంటలకు వినాయకస్వామి పూజ, సాయంత్రం 6 గంటలకు అంకుర్పారణ, రాత్రి 7 గంటలకు మూషిక వాహనంపై వినాయకస్వామి ఊరేగింపు ఉంటాయన్నారు. 21న ఉదయం కలశస్థాపన, మండపారాధన, గణపతి హోమం, గోపూజ, పూర్ణాహుతి, ప్రసాద వినియోగం 7.30 గంటలకు మయూర వాహనంపై సుబ్రమణ్యంస్వామి, రాత్రి 7 గంటలకు సింహ వాహనంపై ఆనందవల్లీదేవి ఊరేగుతారని తెలిపారు. 22వ తేదీ ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం 7.30 గంటలకు శేషవాహనం, రాత్రి భూత వాహనంపై స్వామివారి ఊరేగింపు, 23న ఉదయం 7 గంటలకు శాకాంబరి అలంకరణ, సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనాలు జరగనున్నాయి. 24న విభూది అభిషేకం, 7.30 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు కామధేను వాహనం, 25న ఉదయం కల్పతరువు వాహనం, రాత్రి 7 గంటలకు అధికార నందివాహనం, 26న మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 1.30 గంటలకు ఆగస్త్య మహామునికి అభిషేకం, 2.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, 4 గంటలకు ఉచిత సర్వదర్శనం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదానం, రాత్రి 7 గంటలకు నంది వాహనంపై స్వామి, అమ్మవారు ఊరేగింపు ఉంటాయని తెలిపారు. 27న ఉదయాత్పూర్వం 1.30 గంటలకు లింగోద్భవ అభిషేకం, 2 గంటలకు సర్వదర్శనం, 9 గంటలకు దక్షిణామూర్తికి అభిషేకం, సాయంత్రం 6 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, దీపారాధన నిర్వహిస్తామని తెలిపారు. 28వ తేదీ ఉదయం 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, 7.30 గంటలకు రావణాసుర వాహనం, రాత్రి 7 గంటలకు శయనోత్సవం, స్వామివారికి ఊంజల్ సేవతో ఉత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు.

దోబీఘాట్‌లో వసతులు కల్పించండి

- బట్టలు ఇస్త్రీ చేసుకునేందుకు పెడ్లు నిర్మించాలి
- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు రజకులు వినతి



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రజక సంఘం నేతలు

తిరుపతి మంగళం : జీవకోన రాజీవ్‌గాంధీకాలనీలోని దోబీఘాట్‌లో వసతులు కల్పించాలని శ్రీజీవలింగేశ్వరస్వామి రజక సేవా సంఘం నాయకులు కోరారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం జీవకోనకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను రజక సంఘం నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి దోబీఘాట్‌లో వసతులు లేక నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. అలాగే రజకులు బట్టలు ఇస్త్రీ చేసుకునేందుకు వీలుగా దోబీఘాట్ వద్ద రేకుల షెడ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే రాజీవ్‌గాంధీ కాలనీ శివారు ప్రాంతంలో హిందూ, ముస్లింలు, క్రిష్టియన్‌లకు సంబంధించి మూడు శ్మశానాలు ఉన్నాయని, వాటికి విడివిడిగా గేట్లు పెట్టించాలని విజ్ఞప్తి చేశారు. శ్మశానాల వద్ద ఉన్న పెద్ద ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వద్ద ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయని, మద్యం, మత్తు పదార్థాలు సేవించి ఆగడాలు సృష్టిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సదాశివం, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్లు మధు, సుధాకర్, కరాటే చంద్ర, అక్కినపల్లి లక్ష్మయ్య, మల్లెల నాగరాజు పాల్గొన్నారు.

శాఖాహారంతో ఆరోగ్యకరమైన జీవితం



శాఖాహార సద్భావన ర్యాలీ

తిరుపతి కల్చరల్ : శాఖాహారంతో ఆరోగ్యకర జీవితాన్ని అనుభవించవచ్చని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అహింసా ధ్యాన మహోత్సవంలో భాగంగా తిరుపతిలో ఆదివారం స్పిరుచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా శాఖాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల్లో శాఖాహారం పట్ల అవగాహన తీసుకురావడం అభినందనీయమన్నారు. ర్యాలీ అనంతరం మహతి కళాక్షేత్రంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, డెప్యూటీ మేయర్ ఆర్‌సీ.మునికృష్ణ, కార్పొరేటర్లు ఎస్‌కే.బాబు, పొన్నాల చంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, వరప్రసాద్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, తిరుపతి స్పిరుచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురామ్ పాల్గొన్నారు.

తిరుపతి అడ్డాగా మతోన్మాదుల కుయుక్తులు

– మతోన్మాదాన్ని అడ్డుకోకుంటే ప్రజాస్వామ్యానికి ప్రమాదం
– రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

తిరుపతి కల్చరల్: తిరుపతి, తిరుమలను అడ్డాగా చేసుకుని మనువాద మతోన్మాదులు కుయుక్తులకు పాల్పడుతున్నారని, రచయితలు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్యలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలుగులో ఖురాన్‌ను విశ్లేషిస్తూ రాసిన పుస్తకాన్ని శనివారం రాత్రి తిరుపతిలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో తగులబెట్టడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. ఈ ఉన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఐక్య వేదికను ఏర్పాటు చేసి పోరాడాలని పిలుపునిచ్చారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ నిషేధించని పుస్తకాన్ని ఎక్కడైనా ఎప్పుడైనా విక్రయించవచ్చన్నారు. సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ మాట్లాడుతూ ఝుంఝులే కవితా సంకలనాలపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని కొట్టివేస్తూ జస్టిస్ జీవన్‌రెడ్డి ఇచ్చిన తీర్పులో ఏ ఆలోచనను నిషేధించలేమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, ప్రముఖ రచయిత ఆచార్య మధురాంతకం నరేంద్ర, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ బీజేపీ, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ వల్ల తిరుపతి డేంజర్ జోన్‌లోకి వెళ్లిపోయిందన్నారు. సాహితీ వేత్త సాకం నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనలో మతోన్మాదులు అల్లరి చేయడంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయాలని ప్రకటించారు. ఈ సమావేశంలో పౌరచైతన్య వేదిక రాష్ట్ర నేత వాకా ప్రసాద్, పరమేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కరవది సుబ్బారావు, అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ.రమణ, ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్ర అధ్యక్షుడు పి.అంజయ్య, రైతు సంగం నేత జనార్దన్, బీసీ సంఘర్షణ సమితి నేత బుసగాని లక్ష్మయ్య, ఐద్వా నేత సాయిలక్ష్మి, గురవయ్య పాల్గొన్నారు.

'మా భూమిని ఆక్రమిస్తున్నాడు'

తిరుపతి కల్చరల్: కౌలుకు భూమి తీసుకుని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న సురేంద్రబాబుపై చర్యలు తీసుకోవాలని బాధితులు వై.గంగిరెడ్డి, నాగిరెడ్డి, రమేష్‌రెడ్డి, మహేష్ రెడ్డి కోరారు. వారు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమాజం వీధికి చెందిన తమ ఐదు కుటుంబాలకు తమ తాతల నుంచి సర్వే నంబర్ 464లో 12 ఎకరాల రిజిస్టర్ పొలం ఉందని తెలిపారు. అందులో కొంత భూమిని సురేంద్రబాబు కౌలుకు తీసుకున్నాడన్నారు. ఆయన పంటలు సాగు చేయకుండా బాబా వేషంతో ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నాడని ఆరోపించారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆ భూమి తనదేనంటూ అమ్మకానికి పెడుతున్నాడని వాపోయారు. దీనిపై ప్రశ్నించిన తమను చంపేస్తానని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై తిరుచానూరు పోలీసు స్టేషనల్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

వ్యక్తిపై దాడి.. చికిత్స పొందుతూ మృతి

– ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



పాపయ్య నాయుడు(ఫైల్)

చంద్రగిరి: అన్నదమ్ముల మధ్య నెలకొన్న వివాదంపై మధ్యవర్తిత్వం చేసేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడి చేశారు. అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపంలోని మోటకంపల్లికి చెందిన అన్నదమ్ములు రాజేష్, హరినాయుడు కొన్నేళ్ల క్రితం తిరుపతిలో స్థిరపడ్డారు. వారు ఆర్థిక లావాదేవీలపై తరచూ గొడవ పడుతున్నారు. ఈ నెల 7వ తేదీ గొడవ పడ్డారు. చంద్రగిరికి చెందిన వారి సమీప బంధువు పాపయ్య నాయుడు(62) తొండవాడ అరుణకాలనీ వద్ద ఇద్దరి మధ్య మధ్యస్తం చేసేందుకు యత్నించాడు. ఈ క్రమంలో హరినాయుడు ఒక్కసారిగా పాపయ్య నాయుడిపై దాడికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలోకి చేరుకున్న అతన్ని బంధువులు తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆయన మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

రైతు విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోండి

పాకాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న రైతు విశిష్ట సంఖ్యకు పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో పుష్పావతి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రతి రైతూ సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో సోమవారం నుంచి 25లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇందుకోసం రైతు పేరు, ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కి లింక్ అయిన ఫోన్ నంబర్ అవసరమవుతాయన్నారు. నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతుకు డిజిటల్ గుర్తింపు కార్డు వస్తుందన్నారు. విశిష్ట గుర్తింపు కార్డు లేకపోతే ప్రభుత్వ రాయితీలు, పథకాలు అందవని వివరించారు.